# శల్య పరీక్ష

వెంటిలేటర్‌లో గూడు కట్టడానికి పిచ్చుకలు పదే పదే చేస్తున్న శబ్దం చిరుమువ్వల కదలికలా చెవిని పడుతూఉంటే నెమ్మదిగా కళ్లు తెరిచాను. ఆస్పత్రిలో చేరాక అంతగా ఆదమరచి నిద్రపోవడం అదే. ఏం మందు ప్రభావమో! స్పృహ రాగానే నా కుడి కాలు కదవలేని పరిస్థితి జ్ఞాపకం వచ్చింది. దానితోటే కాస్త బాధ, అసౌఖ్యంకూడా అనుభవంలోకి వచ్చినట్లనిపించింది. నా పొరుగు మంచంమీద చిద్విలాసంగా కళ్ళు మూసుకుని యోగనిద్రలో మునిగిపోయినట్లున్న ముసలాయన వేపు చూశాను. వేదాంతిలా ఉన్నాడు. అతని పెదవులమీద తొలి సంధ్య వెలుగులాటి చిరునవ్వు చూస్తే నా బాధ ఉపశమించినట్లయింది. మాటామంతీకి కాస్త దూరమే. అయినా, పరస్పర చూపులతో, చిరునవ్వులతో మమతనీ, స్నేహాన్నీ పంచుకుంటూనే ఉన్నాం. కిటికీలోంచి వచ్చే గాలితరగలకి అతని తెల్లటి గడ్డం శరన్మేఘంలా తేలికగా కదలాడుతోంది. అతని మోకాలికీ ప్లాస్టర్ వేశారు. కానీ, నాకు వేసినట్టు తొడ నుంచి మడమ దాకా కాదు. అతను బాత్‌రూమ్‌లో జారిపడితే, నేను రోడ్డు మీంచి పోతూ మూతలేని మాన్‌హోల్‌లో కాలేసి తొడ ఎముక చిట్లగొట్టుకున్నాను. మాన్‌హోల్ మూతలు కూడా దొంగిలించి అమ్ముకునే స్థితికి ప్రజల్ని తీర్చిదిద్దుతున్న పెద్దతరానికి ఇలాటి ప్రమాదాలు ఎదుర్కోక తప్పదని చిన్న స్కూల్ టీచర్‌గా నాబాధ్యతకూడా గుర్తు చేసుకుని నిట్టూర్చాను.

మంచాలమీద బందీల్లా కదలలేక పడిఉన్నా జ్ఞానేంద్రియాలు సజావుగా పని చేస్తున్నాయి. కళ్ళతో, చెవులతో వార్డులోని ప్రతి దృశ్యాన్నీ, శబ్దాన్నీ జీర్ణించుకుంటూ కాస్త కాలక్షేపం చేస్తున్నాను.

వార్డులో అంతా సర్కస్ సిబ్బందిలా కనిపిస్తారు నాకు. ఎవరి పనులు వాళ్ళవే. ఎవరి బాధ్యతలు వాళ్ళవే. తెల్లారగానే ఫిజియోథెరపిస్టు వచ్చి మంచాల మీదున్న కొందరిచేత చిన్న చిన్నగా వేళ్ళు కదలించడం, కాలో చెయ్యో చాచడం లాటి వ్యాయామం చేయిస్తూ ఉంటాడు. ఇంతలో పాత సినిమాలో పాట పాడుకుంటూ స్వీపర్ యాదయ్య లోషన్ నీళ్ళలో

గుడ్డ ముంచి, తనతోపాటు బకెట్ జరుపుకుంటూ గచ్చుని తుడుస్తూ ఉంటాడు. అటూ ఇటూ పనులమీద తిరిగేవాళ్ళంతా ఊరికే తిరుగుతున్నారని, తడి ఆరకుండా తొక్కుతున్నారని విసుక్కుంటూ ఉంటాడు. ఇద్దరు సహాయకులు చక్రాల బండిని మంచాల మధ్యగా తోసుకుపోతూ పాలు, బ్రెడ్ పంచుతూ ఉంటారు. ట్రైనింగ్ నర్సులు అవసరమైనచోట రక్తపోటూ, టెంపరేచర్ చూసి రికార్డు చేస్తూ ఉంటారు. ఇంకో జట్టు సిస్టర్లు పక్క బట్టలు మార్చి, దిళ్ళు సరి చేసి, రోగుల్ని చిరునవ్వుతో పలకరించి, కాస్త పాతబడ్డవాళ్ళను ఛలోక్తులతో నవ్వించి కదలిపోతూఉంటారు. టెస్ట్ రిజల్ట్సు చూసి జూనియర్ డాక్టర్లు ఆ రోజు ఆపరేషన్‌కి పంపవలసిన వాళ్ళని సిద్ధంచేస్తూ ఉంటారు. సుమారు పది గంటలు దాటే వేళ సీనియర్ కన్సల్టెంట్ వారానికి రెండు మూడుసార్లు వచ్చి వార్డు స్పెషలిస్టుతో కొన్ని కేసులు చూసి సలహాలు, సూచనలు ఇచ్చి వెళ్ళిపోతూ ఉంటాడు. తేలికగా సంగీతం వినవస్తూ ఉంటుంది.

ఒక ఉదయం ఎవరో అమ్మాయి వచ్చి నా చేతిలో ఏదో పత్రిక ఉంచి "మీకేమైనా ఉత్తరాలు రాసిపెట్టి పోస్టు చెయ్యమంటారా?" అని అడిగింది. నాకర్థంకాక ఆమె వేపు చూశాను.

"మేం రెడ్‌క్రాస్ సంస్థ నుంచి వచ్చాం. మీ బంధువులకు ఉత్తరాలు రాసి మేమే పోస్టు చేస్తాం- మీకు కావాలంటే. ఈ పత్రిక మీకు కాలక్షేపానికి" అని వివరించింది. ఇలా వార్డులోని రొటీన్‌కి అలవాటు పడిపోయిన నేను ఒక తెల్లవారి కళ్ళు విప్పేసరికి వార్డంతా గందరగోళంగా ఉంది.

ఏమైందీ అర్థం కాలేదు. వార్డంతా ఇరుగ్గా ఉన్నట్లనిపించింది. మా వేదాంతి మంచం మాయాబజారు మంచంలా నా మంచానికి దగ్గరగా వచ్చేసింది. వార్డులో అదనంగా కొన్ని మంచాలు వేశారులా ఉంది. ఆ క్షణాన సిస్టర్లూ, ఆయాలూ, డాక్టర్లూ అంతా అక్కడే ఉన్నారా అనిపించింది- ఆ కోలాహలం చూస్తే. మౌనముద్రలో ఉన్న వేదాంతి పెదవుల మధ్య ఇరుక్కున్న మీసాల అంచుల్ని మునివేళ్ళతో తీసి సవరించుకుంటూ గాఢంగా నిట్టూర్చాడు. మంచాలమీద కొత్త శాల్తీలు, వాళ్ళ చుట్టూ చేరినవాళ్ళు ఏవో మాట్లాడుకుంటున్నారు. వేదాంతి నా కళ్ళలోని ఆరాటాన్ని గ్రహించినట్లున్నాడు.

"ఇలాంటి దుర్మార్గాలు, దాడులు, ప్రతిదాడులు,ఎముకలు విరగ్గొట్టుకోడాలు, ప్రాణాలు తీసుకోడాలు ఎంత సామాన్యమై పోతున్నాయో చూడండి. ప్రజలుకూడా సర్వసాధారణ విషయాల్లా వీటికి అలవాటు పడిపోతున్నారు'' అన్నాడు నెమ్మదిగా. కాలు కదపలేక మంచానికి అతుక్కుపోయిన వాళ్ళని ఆదుకోగలవి వార్తాపత్రికలే. అందుకే ఆ దినం పత్రికల్ని అక్షరం విడవకుండా చదివేశాము. స్థానికంగా జరిగిన కొట్లాటలు కొంత అర్థమైపోయాయి.

"మొన్నమొన్న హోలీకి బస్తీల పోరలంతా ఒక్కటిగ ముద్దుగ రంగు జల్లుకున్నారు. ఇంతల ఏమాయెనో ఏమో?" అని కన్నీళ్లు పెట్టుకుంది ఒక తల్లి, కొడుకుని జాలిగా చూసుకుంటూ.

"బస్తీలోని పిల్లలంతా రెండు శిబిరాలు పెట్టుకున్నారు. ఒక శిబిరంలో పెట్టుకున్న నేత చిత్రపటాన్ని ఇంకో శిబిరంవాళ్ళు అవమానపరిచేరట. దాన్తో చిలికి చిలికి గాలి వానగా పెరిగి పెద్దలుకూడా చేతులు కలుపుకున్నారు"అంటూ ఇంకో వ్యక్తి కాస్త వివరిస్తున్నాడు తనకి తెలిసినంతవరకూ.

నా పొరుగు వేదాంతి అంతా వింటూ నావేపు చూశాడు. మంచాలు రెండూ దగ్గరగా వచ్చిన కారణంగా శ్రమ లేకుండా నెమ్మదిగా మాట్లాడుకునే సౌకర్యం ఏర్పడింది మాకు. అతని కళ్ళలోకి చూశాను.

"విద్యుద్దీపాన్ని మనకిచ్చి పుణ్యం కట్టుకున్న ఎడిసన్ చాలా కాలంగా డీసి విద్యుత్తు ఏసీ విద్యుత్తు కన్నా ప్రయోజనకరమైందీ, ప్రమాదం లేనిదీ అని నమ్మాడు. వెస్టింగ్ హోజ్‌తో వాదన పెంచుకుని ఘర్షణ పడ్డాడు. కానీ, ప్రత్యర్థి వాదంలో బలం ఉందని తెలుసుకున్నాక నిర్మొహమాటంగా ఆ నిజాన్ని ఒప్పుకుని ఏసీ విద్యుత్తుకే తన వోటు వేశాడు. నా కుందేటికి మూడు కాళ్లు అని కూర్చోలేదు" అంటూ గొంతు కాస్త సవరించుకున్నాడు. నేను వింటూ యాంత్రికంగా తల ఊపానే కానీ, అతని అంతరంగం నాకు అర్థం కాలేదు. వివరణ అడిగే సాహసం లేక అలానే చూస్తున్నాను.

"కోపర్నికస్, గలీలియోలు ఎన్నో వందల సంవత్సరాలు ప్రచారంలో ఉన్న భూమి కేంద్ర సిద్ధాంతం శుద్ధ తప్పు అనుకొన్నాక ప్రపంచమంతా వాళ్ళని పిచ్చివాళ్ళకింద కట్టి హింసించినా, నిప్పులాంటి నిజాన్ని కడుపులో దాచుకోగలిగారా? నిత్యసత్యాన్వేషులు, వాళ్ళు నిజంగా నిప్పురవ్వలే..."

ఈ మాటలు విన్నాక నామెదడులో ఏదో చిన్న కలవరం రేగింది. వేదాంతి ఎటు లాక్కుపోతున్నాడో తెలియకపోయినా, ఆ మాటల్లో ప్రతిఘటించవలసిన విషయం అంతవరకు నాకు కనపడలేదు. చిన్న సైన్సు మాస్టారుగా జీవితం వెలగబెట్టిన నాకు అతను ప్రస్తావిస్తున్న విషయాలు లోతుగా తెలీక పోయినా, కాసింత పరిచయమైనవే. తల ఊపాను.

"మన లక్ష్యాలేమిటో, మన దారు లెటు పోతున్నాయో, ఎంతవరకు గమ్యంవేపు సాగుతున్నామో వెనక చూపూ ముందు చూపూ లేదుకదా. ఈ రోజు మనుషుల్ని చీల్చుకు వోట్లు పోగుచేసుకోవాలనే తపనకు మించి రేపటి గురించీ, వచ్చే తరం గురించీ ఎవరికైనా చింత ఉందా? ఈ పసివాళ్ళకి వాళ్ళ వాళ్ళ శిబిరాల్లో పూజిస్తున్న మహానాయకులు ఎలాటి తియ్యటి కలలు కన్నారో తెలీదు. వాళ్ళని వీళ్ళు చూడలేదు. వాళ్లు కళ్ళుమూసేసరికి వీళ్లు

కళ్లు విప్పనేలేదు. వాళ్ళ ఉదాత్త లక్ష్యాల్ని గురించి ఈ వెర్రి నాగన్నలకు సరిగ్గా చెప్పగల పెద్దలే కరవైపోతున్నారు. వీళ్ళిలా కొట్టుకు, తిట్టుకు..." వేదాంతి మనోభావాలు కాసింత స్పష్టంగా రూపుదిద్దుకుంటున్నాయి అనిపించింది అప్పటికి.

ఆ రాత్రి ఎప్పటిలా వార్డులో ప్రశాంతత ఆవరించి అందరూ నిద్రలోకి జోగుతున్న వేళ నాకు నిద్రరాలేదు. వేదాంతి అప్పటికే మంచి నిద్రలో ఉన్నాడు. అతని మాటలు నా చెవుల్లో రింగుమంటున్నాయి.

అంతర్ముఖంగా ఆలోచిస్తున్నాను. నా మనసు గతం, వర్తమానం, భవిష్యత్తును ఏకం చేస్తూ అవలీలగా వెనక్కీ, ముందుకీ పరుగుతీస్తోంది. మనిషిని ఇతర ప్రాణికోటి నుంచి వేరు చేసే ప్రత్యేకత ఇదేనేమో. శబ్దవేగంతో పోయే విమానాలైనా ఆగి వెనక్కు వెంటనే ప్రయాణం చెయ్యలేవు. కానీ, మనిషిలోని మనసుకు అది అసాధ్యంకాదు. మంచానికి అతుక్కుని, నిద్రరాని పరిస్థితిలో ఆ సౌలభ్యమే నాకు వరంలా తోచింది.

పొరుగింటి రాజ్యలక్ష్మి, ఆమె తమ్ముడు బేతరాజు, తుమ్మపాలలో నా బాల్యం మనోనేత్రం ముందు లీలగా కనబడుతూ ఉంటే ఆలోచిస్తున్నాను. వార్డులోఆఉదయం సంఘటననూ, వేదాంతి మనోవ్యధనూ, ఈ చిన్ననాటి నా జ్ఞాపకాలనూ ఏదో విచిత్రమైన సూత్రం కలుపుతున్నట్లుంది. ఒకే రెమ్మలో విరిసిన పువ్వులైనా రాజ్యలక్ష్మికీ, బేతరాజుకీ ఎంత తేడా! ఏ చదువూ లేకుండా ఎదురుగా ఉన్న ప్రపంచాన్నే చదువుకున్న రాజ్యంలో ఉన్న హుందాతనం ఆమె చిన్న తమ్ముడు బేతరాజులో మచ్చుకైనాకనబడేదికాదు అందుకేనేమో ఆమె కొంగు వదలకుండా ఆరాధిస్తూ తిరిగేవాణ్ణి. ఎప్పుడూ మా ఇంట్లోనే ఉంటావెందుకన్నట్లు బేతరాజు ప్రవర్తించిన ఒక మధ్యాహ్నం వేళ "మా ఇంట్లో అక్క లేదేమీ" అని నేను రాజ్యలక్ష్మిని ప్రశ్నిస్తే, "మీ ఇంటి పక్కనే రాజ్యలక్ష్మి ఉంది కదా- వేరే ఇంకో అక్కని అనవసరంగా సృష్టించడం ఎందుకని ఆ భగవంతుడు అనుకుని ఉంటాడు" అని గలగల నవ్వింది.

ఆమె పెళ్ళి జరిగి రెండు మాసాలు కాలేదు. ఒక మధ్యాహ్నం నేనూ, బేతరాజూ స్కూలునించి వచ్చాం. ఆ వీధిలో అంతా గొడవగా ఉంది. "గట్టిగా ఇరవై ఏళ్ళు లేని పసిపిల్లకు వైధవ్యమేమిటి? ఎంత అన్యాయం" అని మా అమ్మ కన్నీళ్ళు పెట్టుకుంటే, రాజ్యం అక్కకి ఏదో కీడు జరిగిందని వెక్కి వెక్కి ఏడ్చాను.

రాజ్యం ఏ వస్తువు లేదనుకున్నా మా ఇంట్లో ఉంటే తీసుకుపోయి ఇచ్చేవాణ్ణి. ఇంట్లో లేకుంటే అమ్మ దగ్గర మారాంచేసి డబ్బులు తీసుకుపోయి అంగట్లో కొని ఇచ్చేవాణ్ణి. అలా చేస్తే నాకు బోలెడు తృప్తి కలిగేది. నేను పిల్లల కథల పుస్తకాలు తెచ్చుకుంటే వాటిని చదివించుకుని వినేది. "అక్కా, నీకు చదువు చెప్పనా" అన్నాను ఒక రోజు. నావైపు జాలిగా

చూసి నవ్వింది. తన ఏకాకి బతుకునూ, దురదృష్టాన్నీ మరచి పోవడానికేమో చేతినిండా పని కల్పించుకునేది. కోడిపిల్లల్ని పెంచడం అందులో భాగమే. వాటికి గింజలూ, నూకలూ చల్లుతూ, తవుడుతో ముద్దలు చేసి విసురుతూ రాత్రివేళ బౌరుపిల్లుల వాత పడకుండా గాలిపారే వెదురు బుట్టను బోర్లించి, బరువుగా ఏదైనా పెట్టి క్షణం తీరిక లేనట్టు గడిపేది. నేను తన వెంట ఉండేవాణ్ణి.

రెండు మూడు కోడిపెట్టలు ఒకేమారు గుడ్లు పొదిగితే, ఆ పిల్లలు తల్లుల వెంట గునగునలాడుతూ కదిలేవి. వాటిని చూస్తే తల్లుల వెంట కోడిగుడ్లే దొర్లిపోతున్నట్లు తోచేది. తల్లులు కాళ్ళతో నేలమీద గీసి పురుగుల్నీ, గింజల్నీ ఏరుకుతినడం నేర్పితే, అవి అలాగే ఆహారం వెతకడం నేర్చుకునేవి. గద్ద నీడ నేలమీద పడితే చాలు, తల్లులకు దగ్గరగా పరుగు తీసి భయంతో అంటుకు పోయేవి. కాస్త పెద్దవయిన తర్వాత తల్లులకు దూరంగా జరిగి ఇటూ అటూ తిరిగి మేతను వెతుక్కునేవి. రాజ్యం అక్క వేసిన గింజల్నీ, తవుడు ముద్దల్నీ పోటీ పడి ఏరుకుతినేవి. ఆ పిల్లల మేళంలో కాస్త నీరసంగా, బెరుగ్గా ఉన్న ఏడెనిమిది పిల్లలు గింజల్ని సరిగ్గా అందుకోలేక పోయేవి. మిగిలిన పిల్లలు వాటిని పక్కకు నెట్టి, వాటి ముందర గింజల్ని ముక్కున కరచుకు పారిపోయేవి. రాజ్యం అక్క ఈ ఏడెనిమిది పిల్లల్నీ వేరే బుట్ట కింద మూసి వాటికి గింజలు, నూకలు వేసి కాపాడేది. మిగత పిల్లల్ని మూసి వీటిని స్వేచ్ఛగా కొంతసేపు పెరట్లో తిరగడానికి విడిచి పెట్టేది. అలా కంటికి రెప్పలా కాపాడితే ఈ ఏడెనిమిది అర్భకుల్లోంచి మూడు నాలుగు పిల్లలు మిగత పిల్లలకన్నా బలంగా కండపట్టి కంటకంగా పెరిగేవి. నీరసంగా ఉన్న పిల్లల్ని పొడిచి, వాటి ముందున్న గింజల్ని ఏరుకుపోయేవి. అప్పుడు ఆ మూడు నాలుగు పిల్లల్నీ తీసి ఆరోగ్యంగా ఉన్న పిల్లలన్నిటితో కలిపి పెంచేది. ఆ పద్ధతులు రోజా అక్కతోఉండి చూస్తూ ఆమె ఓపికకూ, సహనానికీ ఆశ్చర్యపోయేవాడిని.

నేను కాలేజీలో చేరి విశాఖలో చదువుకుంటున్న రోజుల్లో చదువు బాధ్యత పెరిగి తుమ్మపాల తరచూ వెళ్ళడం కుదిరేదికాదు. అంతలో నాన్నగారే విశాఖపట్నం మకాం మార్చేశారు. నేను బి.ఎస్సీ చదువుతూ ఉండగా చెవిన పడ్డ వార్త నన్ను కుంగదీసింది.

టైఫాయిడ్ వచ్చి రిలాప్స్ అయి రాజ్యం అక్క పోయిందని వాల్తేరు స్టేషన్‌లో కనుపించిన బేతరాజు చెప్పాడు. ఆ తర్వాత కోడి పిల్లలు కనిపిస్తే రాజ్యం అక్క జ్ఞాపకం వచ్చి కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి.

నన్నుఎక్కువ ఆశ్చర్యపరచే విషయం ఇంకొకటి ఉంది. అక్కా వాళ్ళింట్లో కోడిని కోసిన రోజున మా ఇంట్లోనే అమ్మ దగ్గర రాజ్యం భోజనం చేసేది. ఆ రోజు మా అమ్మ పొరపాటున కూడా కోడి కూర చేసేది కాదు. రాజ్యం అక్కంటే మా అమ్మకు వల్లమాలిన ప్రేమ.

విజయనగరం మునిసిపల్ హైస్కూల్లో నేను సైన్స్ టీచర్‌గా ఉంటున్న రోజుల్లో

బేతరాజు ఓమారు కలిశాడు. అక్కడికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బదలీ అయి వచ్చినట్లు చెప్పాడు. పాత బస్ స్టాండ్ దగ్గర పార్కులో కలిసినప్పుడు తరచూ ఒకటే విషయం మాట్లాడేవాడు. 'మనం ఐకమత్యం లేక పాడైపోతున్నాం' అనేవాడు- లౌక్యంగా, తను మనసులోనిమాట స్పష్టంగా చెప్పేవాడు కాదు. నాకు అర్థమైచావక ముభావంగా ఊరుకునేవాణ్ణి. ఒకటి రెండుసార్లు అతని ఇంటికి వెళ్ళాక అతని కార్యక్రమం కాస్తంత తెలిసింది.

ఏవో పుస్తకాలు తిరగేసి రాజవంశ చరిత్రలు, వంశవృక్షాలు సేకరించేవాడు. ఒకమారు "మనది హైహయరాజ వంశం" అన్నాడు.

"ఒక శాఖ శ్రీకూర్మం వచ్చి కొంత కాలం ఉన్నట్లు శాసనాలున్నాయి. పౌరాణికంగా చూస్తే మన మూలపురుషుడు కార్తవీర్యార్జునుడు. మా ముత్తాత బొబ్బిలి యుద్ధంలో పాల్గొన్నాడట" అంటూ వాళ్ళ ఇంట్లో వంశానుగతంగా మిగిలిన ఒక పాత కత్తిని చూపించాడు.

నేను తల ఊపుతూ బుద్ధుడు కూడా క్షత్రియుడే అన్నాను. నేను తన సూచనలు సీరియస్‌గా తీసుకోనందుకు కాస్త చిన్నబుచ్చుకున్నట్లు కనపడ్డాడు. ఆఖరికి ఒకనాడు తన మనసులోనిమాట బయటపెట్టాడు.

"కుల సంఘం ఒకటి స్థాపిస్తున్నాను. నువ్వుకూడా సభ్యత్వం తీసుకోవాలి. తప్పదు. నాకు కుడిభుజంలా పనిచెయ్యాలి" అన్నాడు.

నేను విని కాస్త మౌనంగా ఉండిపోగానే, "ఎవరి ప్రయత్నాలు వాళ్ళు చేసుకుంటున్నప్పుడు మనలో ఐకమత్యం లేకపోతే మన పిల్లలు మట్టి కరుచుకుపోతారు. గాలికీ, నీటికీ వాచిపోతారు ముమ్ముందు" అని నిష్ఠురంగా నావేపు చూశాడు.

నేను ఏదో చెప్పక తప్పదని గ్రహించాను.

"సమాజం అలాగే రూపుదిద్దుకుంటే ఇంక ఆ జీవితంలో ఏం థ్రిల్ ఉంటుంది? అందరితోపాటే అంతరించిపోదాం" అన్నాను తేలికగా నవ్వుతూ. బేతరాజు కళ్ళలో అసహనం స్పష్టంగా కనిపించింది.

"స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుంచీ పుట్టుకొస్తున్న ఈ సంఘాలు చేస్తున్న నిర్వాకమేంటి? వాటి అస్తిత్వం నిలబెట్టుకోవడం. ప్రత్యేకమైన సదుపాయాలేమైనా తాత్కాలికంగా సమకూడితే వాటిని ఇంకా కొంత కాలం పొడిగించాలని ఒత్తిడి తేవడం. ఒకవేళ అలాటి ప్రత్యేక సదుపాయాలు లేకుంటే అవి మాకు కూడా వర్తింపచెయ్యమని ఎన్నికలముందు ఉద్యమించడం. అంతకు మించిన ఉదాత్తమైన లక్ష్యం, కార్యక్రమం ఏదైనా ఉందా?" అని ఎదురు ప్రశ్న వేశాను.

ఇలాటి పిడివాదులతో ఏం సాధిస్తాం అని నిష్ఠూరంగా మొహం తిప్పుకున్నాడు. ఆ తర్వాత మళ్ళీ నాకు ఎక్కడా కనపడలేదు.

బాగా కోపం వచ్చిందనుకున్నాను. ఆ విషయాన్ని అంత ప్రతిష్ఠాత్మకంగా, వ్యక్తిగతంగా ఎందుకు తీసుకున్నాడో, ఎందుకంత ఆవేశపడ్డాడో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు.

విద్యార్థులు ఘర్షణపడి కొట్టుకుని వార్డులో చేరిన రోజున ఆ పిల్లల్నిచూశాక నాకు బేతరాజు మళ్ళా జ్ఞాపకం వచ్చాడు.

వారం రోజుల తర్వాత ఎవరో సీనియర్ కన్సల్టెంట్‌ని తీసుకుని వార్డు స్పెషలిస్టు మాకు దగ్గరగా ఉన్న ఒక కేసు చూపించడానికి వచ్చాడు. కేసును చూసి ఏవో సూచనలిచ్చి వెళ్లిపోబోతున్న ఆసీనియర్ నాపక్కనున్న వేదాంతి వైపు పరీక్షగా చూసి, ఒక్క క్షణం ఆగి, "మాస్టారూ, బాగున్నారా? నేను జ్ఞాపకం ఉన్నానా?" అని ప్రశ్నిస్తూ ఎంతో వినయంగా కాళ్ళ దగ్గర కూర్చున్నాడు.

అంతతో ఆగలేదు. "మీ దయతో ఇలా కాస్త పదిమందికి ఉపయోగపడుతున్నాను. స్పెషల్‌రూమ్‌కి మారిపోండి. ఏర్పాటుచేస్తాం" అని భక్తిశ్రద్ధలు వ్యక్తంచేశాడు.

"ఎందుకూ? ఇక్కడ నాకు సదుపాయంగా ఉంది. ఇంక కొద్దిరోజుల్లో డిస్చార్జి చెయ్యవచ్చు కూడా..." అని వేదాంతి అతన్ని వారిస్తూ ఉంటే, నా పొరుగు ముసలాయన అసాధారణ వ్యక్తి అని అప్పటికి తెలిసి వచ్చింది.

ఆ విధంగా సీనియర్ కన్సల్టెంట్ ఎప్పుడు వార్డులోకి వచ్చినా వేదాంతిని పలకరించి కాస్త పాత విషయాలు జ్ఞాపకం చేసుకోవడం, ఆ సంభాషణల్లో నేనూ కాస్త మాట కలిపి వాళ్ళ ఆనందాన్ని పంచుకోవడం జరిగేది.

"నాకు చావంటే భయం లేదు కానీ, కాలు, చెయ్యి విరగ్గొట్టుకుని మంచం పట్టడం అంటే ఎంత భయమో అంతా జరిగింది" అన్నాను ఒక రోజు. సీనియర్ కన్సల్టెంట్ నా కేస్‌లో ఉత్సాహం కనపరచి, కేస్‌షీట్, టెస్ట్ రిపోర్టులు చూసి "అంత భయపడవలసిందేమీ లేదు. చిట్లిన ఎముక కలుస్తుంది. మీరు నిశ్చింతగా ఉండవచ్చు" అని ధైర్యం చెప్పాడు.

అంతటితో ఊరుకోక నా మనసులో ఉన్న ఆందోళనను లౌక్యం తెలీకుండా బయటపెట్టాను.

వార్డులో మంచాలు ఖాళీ కావాలని డాక్టర్లు తొందరపడి ప్లాస్టర్ కాస్ట్ తీసేస్తారని అనుకుంటూఉంటే విన్నాను. అలాకాక, నాకు ప్లాస్టర్లు ఎక్కువ దినాలు ఉండేటట్టు చెయ్యమని కోరాను. అలాగైతే ఎముక బాగా అతుక్కుంటుందన్న ఆశతో. ఆ కోరిక విని ఆ పెద్ద డాక్టర్ పకపక నవ్వుతూఉంటే వేదాంతి కూడా గొంతు కలిపి విరగబడి నవ్వాడు. వాళ్ల ఇద్దరి నవ్వులూ నాకు అర్థం కాక చాలా సిగ్గుపడి కుంచించుకుపోయాను.

"చదువుకున్న వాళ్ళకే ఇలాంటి అభిప్రాయాలుంటే సామాన్యుల మాటేమిటి?" అన్నాడా కన్సల్టెంట్... ఇంతలో వేదాంతి కలగజేసుకుని చిన్న వివరణ ఇచ్చాడు నా కోసం.

"ఎముక చిట్లినా, చాలాకాలం స్ట్రెస్‌కి లోనై బలహీనం అయినా సాధారణమైన ఒత్తిడిని కూడా తట్టుకోలేదు. అందుకే దీనికి ఒత్తిడి కలక్కుండా ప్లాస్టర్ కాస్ట్ వేసి రక్షణ కవచంలో ఉంచుతారు డాక్టర్లు. అయితే, మన శరీరం అలాటి పరిస్థితిలో చూస్తూ ఊరుకోదు. యథాతథంగా ఎముక అతుక్కుని బలపడాలని విశ్వప్రయత్నంచేస్తుంది. చిట్లిన ఎముక అంచుల్లోకి కేలస్ అనే సిమెంటు లాటి పదార్థాన్ని విడుదలచేస్తుంది. సరియైన మోతాదులో, కావలసిన పాకంలో కేలస్ విడుదల అయినప్పుడు ప్లాస్టర్ రక్షణ తీసి, చిన్న చిన్న ఒత్తిడులకు ఎముకను అలవాటుచేయిస్తారు. క్రచ్చస్‌మీద కాస్త దూరంనడిపించి వ్యాయామం ఇస్తారు. అలా విరిగిన ఎముక కేలస్‌ని సద్వినియోగం చేసుకొని అతుక్కుని బలపడుతుంది. కేలస్ విడుదలగురించి అప్పుడప్పుడు పరీక్షలు జరిపి తెలుసుకుంటారు" అన్నాడు.

"ప్లాస్టర్ కవచం సమయానికి తియ్యక ఎక్కువకాలం ఉంచితే మంచిది కాదా?" అని నేను అడిగాను, ఉత్కంఠతో.

"మీరడిగిన ప్రశ్న చాలా ముఖ్యమైంది. అలా కవచం తొడిగేసి మరి దానిగురించి పట్టించుకోకుండా వదిలేస్తే కీళ్లు బిగుసుకుపోయి, ఆరోగ్యంగా ఉన్న కండరాలుకూడా పనిచెయ్యడం మరిచిపోయి, పనిలేక ఫైబ్రోజ్ అయిపోతాయి. ఎముక సన్నబడి, కేలస్ పలచబడిపోయి పేషెంటు నేనింక నడవలేనన్న అధైర్యంతో మంచం దిగడు. ఆస్టియోపొరోసిస్ అన్న అవలక్షణం వచ్చి చివరకు సెప్టిసీమియా అనే వ్యాధిని కొనితెచ్చుకుంటాడు. అలా సకాలంలో ప్లాస్టర్ కాస్ట్ తియ్యకుంటే ప్రాణానికే ముప్పు రావచ్చు" అన్నాడు అరటిపండు ఒలిచినంత సులభంగా వివరిస్తూ ఆ వేదాంతి. ఏమీ ఎరగనట్టున్న వేదాంతి ఇలా కలగచేసుకొని చెప్పడం నాకు ఆశ్చర్యంగానే ఉంది.

"అన్ని ఫ్రాక్చర్లూ ఒకేలా ఉండవు. దేని చికిత్సాకాలం దానిదే. దేని బలహీనత దానిదే. ఒకేలా రక్షణకవచం తొడిగేస్తే సరిపోదు. అందుకే రక్షణ కవచం ఎంత అవసరమో, దానిని సకాలంలో తియ్యడంకూడా అంత ముఖ్యమయిన విషయమే" అని సీనియర్ కన్సల్టెంట్ కూడా గొంతు కలిపి నా సందేహాన్ని తీర్చాడు.

సాంకేతిక పరిజ్ఞానం లేక నేను పెట్టుకున్న భయాలకు నాకే సిగ్గువేసింది. "ఉదాహరణకు మన మిద్దరం ఉన్నాము. మీకు తగిలిన దెబ్బ కాస్త పెద్దది. ఫీమర్‌నెక్ దగ్గర చిట్లింది. అందుకే మీరు కాస్త ఎక్కువకాలం ప్లాస్టర్‌లో ఉండక తప్పదు. నా కేసులో చిన్న స్థానభ్రంశం. నేను మరో వారం పది రోజుల్లో వెళ్లిపోవచ్చు. పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రం అన్నట్లుగా అన్ని ఫ్రాక్చర్లకీ ప్లాస్టర్ కాస్ట్ వేసి ఒకేలా ట్రీట్‌చేస్తామంటే అది సరయిన చికిత్సకాదు" అన్నాడు వేదాంతి.

మంత్రముగ్ధుణ్ణయి ఆ మాటలు వింటూఉంటే నా మనసు ఏదో వింత సందేహాలతో సతమతమౌతోంది.

ఈ శాస్త్రీయ విజ్ఞానం నిత్యజీవితంలో మనం ఎంతవరకు ఉపయోగించుకోగలం అనుకుంటున్నాను.

ఒక ఉదయం వేదాంతి మంచం ఖాళీచేసి, సంచీ సర్దుకుంటూ నావేపు వీడ్కోలుగా చూశాడు. ఆ చూపుల్లో ఎంతో స్నేహభావం కనిపిస్తోంది. నేను, నాదగ్గర ఉన్న నోట్‌బుక్ ఇచ్చి ఆటోగ్రాఫ్ కోసం అర్థించాను. తమసోమా జ్యోతిర్గమయ అని రాసి సంతకం తెలుగులో చేశాడు.

వార్డు డాక్టర్లూ, సీనియర్ కన్సల్టెంట్, మిగతా సిబ్బంది వేదాంతిని ఎంతో భక్తిశ్రద్ధలతో సాగనంపినప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది.

ఆటోగ్రాఫ్‌లో సంతకం ఎంత జాగ్రత్తగా చూసినా పేరు చదవలేకపోయాను.

వార్డులో డాక్టర్లు మరునాడు మాట్లాడుకున్న వివరాలు ఎంతో ఆశ్చర్యం కలిగించాయి. వేదాంతి అనాథాశ్రయంలో పెరిగినవాడట. కాలేజీలో చదివి, స్టేట్స్‌లో పరిశోధనలుచేసి, ఢిల్లీలోని ప్రముఖ పరిశోధకసంస్థలో కొన్నాళ్లు పనిచేశాడట. యాజమాన్యంతో సిద్ధాంతపరమైన విభేదం వచ్చి రిజైన్ చేశాడట.

సీనియర్ కన్సల్టెంట్ వార్డులోకి వచ్చినప్పుడు చెప్పిన ఇంకో సమాచారం వేదాంతిపట్ల ఇంకా భక్తిభావం పెంచింది.

ఆర్ఫనేజిలో పెరిగినప్పుడు ఏదో పేరు ఉండేదట. ఆయన కాలేజీలో లెక్చరర్‌గా ఉన్నప్పుడు తన పేరు 'సత్యకాముడు' అని అతనే మార్చుకుని గెజెట్ ద్వారా నోటిఫై చేసుకున్నాడట.

ఎప్పుడో జబలసుతుడి కథచదివిన జ్ఞాపకం.

ఇప్పుడు అంతటి మనిషితో కలిసి ఆస్పత్రిలో స్నేహాన్నిపంచుకున్నందుకు నన్ను నేను అభినందించుకున్నాను. వేదాంతి చిరునవ్వు ఉషోదయంలా నా మనసులో నిలిచిపోయింది.

(ఇండియా టుడే, అక్టో 21-నవం 5, 1992)